# 'వినిపించని రాగాలు'

నాకు అదెందుకు పుట్టిందో, ఎట్లా పుట్టిందో తెలీదుగానీ... వీణా వేణువుల్ని చూస్తే ఆహా! సంగీత వాద్యాలంటే ఇవీ... అసలు సంగీత వాద్యాలంటే యిట్లా ఉండాలి, అంతే... అని" ఈ రోజున శేషగిరిరావుగారు అబ్బులు వాళ్లింటికొచ్చే రోజు, ఈ రోజునించీ నువ్వు శేషగిరిరావుగారి దగ్గర ఫిడేలు పాఠాలు, వారానికి మూడ్రోజుల ప్రకారం నేర్చుకుంటున్నావు" ఓ శుభోదయాన అమ్మ అల్టిమేటం జారీచేసింది.

వీణా కాదు, ఫ్లూటూ కాదు... కుయ్ కుయ్మనే ఫిడేలా? నైజాన్తా అనుకుని "ఫిడేలు నేర్చుకోను నేను వీణ నేర్చుకుంటా" అని ఓ పావుగంట గొడవ. చీమిడి కారినా సరిగా తుడ్చుకోడమే రాని వాడి మాటకు విలువ కూడానా...

అబ్బులు వాళ్లింటికెళ్లాం అమ్మా నేనూ... అబ్బులుగాడు నేర్చుకునేవాడు కాదుగానీ మాణిక్యాంబ నేర్చుకునేది. ఇంకా యిద్దరో ముగ్గురో వచ్చేవాళ్లు. అందరికీ అబ్బులు వాళ్లింట్లోనో పాఠాలు.

మేం వెళ్లిన కాస్సేపటికి కూతురు నడిపిస్తోంటే చేతిలో రాగాలపెట్టెతో, కళ్లకి నల్ల కళ్లజోడుతో వచ్చారు శేషగిరిరావుగారు. వారు అంధులు. తాంబూలం దక్షిణ ఇప్పించి ఆయన కాళ్లకి దండం పెట్టించిందమ్మ.

ఆయన కమానుని తీగమీద పెడితే కమ్మగా పలుకుతుంది వయొలిన్. నేను పెడితే బర్రున శబ్దం వచ్చేది. నాకు చికాకు కలిగేది. అదీగాక లోలోపల ఆ వాద్యం పట్ల అయిష్టం తోడైంది. ఓ నెల్రోజుల్తర్వాత తేలిపోయింది నాకూ వయొలిన్ పడదని... క్లాసులు ఎగ్గొట్టడం మొదలైంది. కాలక్రమేణా అమ్మకర్థమైపోయింది. "నీ ఖర్మ" అని మానిపించేసింది.

* * *

అవి నేను దేశదిమ్మరిగా తిరుగుతూన్న రోజులు... భుజానికి సంచీ, అందులో ఓ జత బట్టలూ, డయిరీ, ఓ పాకెట్ సైజు డిక్షనరీ... డబ్బు అయిపోయినప్పుడు అక్కడో ఇక్కడో ఓ పదిరోజులు పన్చేయడం, మళ్లీ దేశాన్నీ ప్రజల్నీ చదవడానికి పయనం.

లఖ్నవ్ చేరుకున్నా... విపరీతంగా జ్వరం, దానికితోడు వ్యసనం వల్ల దెబ్బతిన్న దేహం. ఇక అయిపోయిందనుకున్నాను. జేబులో నలభై రూపాయలున్నై. అందులో కాస్త వెచ్చించి మద్యం కొని తాగాను. వ్యసనపరుడు కొసరు తప్పక కోరుతాడని, యింకాస్త

మద్యాన్ని ఖరీదు చేసి తాగా. అచ్చు మన హైదరాబాద్ పాత బస్తీ వీధుల్లాంటి లఖ్నవ్ వీధుల్లో తిరుగుతూ ఫుట్‌పాత్‌పై పడిపోయా, అది ఆఖరి స్ఫురణ... కళ్లుతెరిచేసరికి ఓ చీకటి గదిలో ఉన్నా. ఎవరో బలవంతంగా లేపి నోటికి ఏదో ద్రవాన్నందించారు. ఎండిన గొంతుకతో దాన్ని తాగేసా... అప్పుడు... వినిపించిందో స్వరం... దానితోపాటు ఓ స్వనం... ఖేదమయ రోదనా తప్త నిక్వణం...

నేను కోలుకోడానికి దాదాపు పది రోజులు పట్టింది. నేను కోలుకున్నది ఓ లావుపాటి వృద్ధురాలి చలువ. ఉదయం టీ, కాస్సేపాగి రోటీ, మధ్యాహ్నం ఏదో ఓ మాంసాహారంతో భోజనం... అట్లాగున పైన మేడపైనించీ కింది నా చీకటి గదిలోకి రాగతరంగాలు కొట్టుకొచ్చేవి. బిలావల్, బాగేశ్రీ, నంద్, యమన్, మాల్‌కౌంస్ కళావతి, చంద్రకౌంస్...

కాలప్రవాహపు ఒరిపిడితో కరుకుగా మారిన స్వరం నించీ రాగాలు... మృదువుగా సితారు వాదనలు తబలా రేకాలు... అవి రెండూ లేకుంటే... కాలాన్ని కట్టివేస్తూ కమనీయ ఆలాప్‌లు తాన్‌పురా ధ్వనితో...

* * *

కోలుకున్నాను... మేలుకున్నాను కూడా...

ఆ మహాతల్లి దగ్గర సెలవు తీసుకోడానికి ఇరుకు మేడ మెట్లెక్కాను... గవాక్షంలోంచీ శూన్యంలోకి చూస్తోందావిడ... అరవై వసంతాల్ని నమిలేసిన వయసు... విశాలమైన కాటుక కళ్లూ, తాంబూల చర్వణంతో ఎరుపెక్కిన పెదవులూ... ఏదో రాగాన్ని మననం చేసుకుంటోంది. అక్కడ ఆమె బానిసల్లా ఓ సితారు, ఓ తంబూరా, ఓ హార్మోనియం, ఓ తబలా... ఓ థూక్‌దాన్ (ఉమ్మిపాత్ర), అద్దాలు పగిలిన బీరువాలో ఉర్దూ సాహిత్యం. మౌనంగా ఆమె పాదాలకు నమస్కరించి వెనుతిరిగానో లేదో... ఆమె ఊర్దూలో పాడసాగింది.

"చిగురించే వసంతపు సువాసనల కలలు కన్నాను
వస్తుందా? వస్తుందా వసంతం? అని వేచి వేసారిన నేను
నా యింటికి (ప్రాంగణానికి) నడిచొచ్చే శిశిరాల్ని చూస్తున్నాను"

ఎక్కడ్నించీ వచ్చారో ఏమో...

సితారు మోగింది. తబలా రేకాలు ఏకాభిప్రాయానికొచ్చాయి. ఖేదపూరితంగా ఆమె అశ్రువులునిండి ఎరుపెక్కిన కళ్లతో... కరిగించివేసే గాత్రంతో పాడుతోంది... రాగం ఆహీర్ భైరవ్ (చక్రవాకం)... సితారు తార తబలా రేకా కలివిడిగా ఆమె స్వరాన్ని అందుకనే ప్రయత్నం చేస్తున్నాయి.

సంగీత తరంగాలు ఆ యింట హోరుమన్నాయి. మేలుకొన్న నేను నిర్ణయించుకున్నా, సంగీత సాహిత్యాలని వదలనని.

ఇప్పటికీ సంగీతం ప్రస్తావన ఎక్కడొచ్చినా నాకిద్దరు గుర్తుకొస్తారు.

ఒకరు అంధులైన శ్రీ శేషగిరిరావుగారు, ఇంకొకరు నన్నాదుకున్న నా లఖ్నవ్ అమ్మ. చివరగా శ్రీ ఎస్. సదాశివగారి మలయమారుతాల్ని నేను సమీక్షిస్తూ ఓ రెండేళ్ల క్రితం వ్రాసిన మాటలే ఇక్కడ తిరగ రాస్తూ ముగిస్తాను.

“మనుషుల్లో మార్దవం ప్రేమా నశించిపోతున్న తరుణంలో… మనిషిలోని మనిషే మాయమైపోతున్నపుడు… మనసుల్లో లాలిత్యాన్నీ, మనిషితత్వాన్నీ నింపే దినుసులు సంగీత సాహిత్యాలు.” ●